# వేదాంతి

ఆరవిచ్చిన జాజి మల్లెల పందిరి సమీపమున మత్తె నెక్కించే మలయ పవనుని చిరు కెరటాల మధుర స్పర్శలలో, ముత్యాల ముగ్గులు పోసిన తిన్నియపై రతనాల కంబళి మీద ఆసీనుడైన జీవానంద స్వాముల వా రిలా ఉపన్యసించారు:

"ఈ ప్రపంచమంతా ఒకనాటకమనీ, మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టిలో లీనమయ్యే మానవులు తోలుబొమ్మలనీ, ఎముకల ప్రోవులనీ, మాంసపు ముద్దలనీ అంటారు. ఈ విధంగా వైరాగ్య మంకురించే దశ ఒకటుంది. ఆ దశలో సహజంగా మానవుడు ఉడిగిపోయి ఉంటాడు. కాటికి కాళ్లు చాచుకొని ఉంటాడు. నేనిప్పుడా దశలోనే ఉన్నాను. ఐనా హృదయం విప్పి చెప్పాలంటే ఆ వైరాగ్యం నా హృదయం నుండి తొలగిపోయింది. రాగలత అంకురించింది. ఇది నీకు ఆశ్చర్యంగా ఉంటుంది. ఎన్నో వేదాంత వ్యాసాలు వ్రాసిన నాలో వేదాంతం నాటుకపోయిందనీ, నేనొక మహా యోగినై పోయానని నా వద్ద ఉపదేశాలు పొందాలని వచ్చిన పిచ్చి వారికి నే నొక పిచ్చివాడనై ఏదో ఉపదేశించాను. అసలు విషయం చెబుతాను."

ఒక్క తృటి కాలం ఆయన ఆగిపోయాడు. అనర్గళంగా స్రవిస్తున్న సెలయేరు అడ్డుపడ్డ చిన్నగుట్టను తప్పుకొని ఏ వంద గజాల పల్లంలోనికో జలపాతంలా దుముకబోతున్నట్టు కన్పించింది. ఆ జలపాతమే...ఆలాంటి గలగలా రావమే ప్రారంభమైంది.

"వివాహం జీవితంలో ఒక మధురఘట్టం అంటారు. పనస తొనల కన్న, పంచదార కన్న ప్రణయంలోని మధురం అతీతమైన హాయిని కల్గిస్తుందన్నారు. ఆలాంటి మధురాను భూతికోసం నేనూ ప్రయత్నించే వయస్సు వచ్చింది. అప్పుడు సౌభాగ్యం మా ఇంటికి ఉత్తరంగా నాలుగో ఇంటిలో ఉండేది. రోజూ ఆ దారిలో పోతున్నప్పుడు ఆరుసార్లు ఆమె తప్పక కన్పిస్తుండేది. నా కామె మీద మనసు పడిన మాట వాస్తవం. ఆమె నన్ను అభిమానించిదో లేదో తెలియదు. తెలుసు కొనే విధానమే నాకు తెలియకపోయింది. నే నా విషయంలో చాలా పిరికివాణ్ణని ఇప్పుడూ ఒప్పుకుంటున్నాను. అసలు విష యం తెలుసుకోవాలంటే చీటీముక్క వ్రాసినా సరిపోయేది. లేదా ఏ మూడో మనిషి చేతనో కబురంపించినా తేలిపోయేది. అలా తెలుసుకోవడం తప్పుగాదనుకొన్నాను కానీ ధైర్యం లేకపోయింది. మాట్లాడే అవకాశాలు కల్గినా మాట్లాడి ఎరుగం. ఆమె నాకంటే అధైర్యస్థురాలనుకొంటాను. కానీ ఆ ఊళ్లో మా చూపులను పసికట్టినవారు ప్రచారం చేశారు. ఆమెను నేను ప్రేమించానని, నే నామెను ప్రేమించానని ఇద్దరూ చేతిలో చేయివేసుకొని ప్రమాణాలు చేసుకొన్నా మని, పెళ్లి చేసుకోబోతున్నామని..."

వెన్నెలలో వెండి తీగల్లా మెరిసి పోతున్న గడ్డాన్ని దువ్వుకొని దిండుమీద మరో దిండు వేసి దానిపై మోచేతిని ఊనుకొని ఆచేతి అరచేతికి తలనాన్చి మళ్లీ తన ప్రసంగా న్నిలా కొనసాగించా డాయన.

"ఈలాంటి ప్రచారం ఆశ్చర్యం కల్గించినా వినడానికి చాలా ఉత్సాహంగానూ, సరదాగానూ ఉండేది. ఒక్కసారి

గర్వంతో గంతులు వేసేవాణ్ణి ప్రేమించి పెళ్లి చేసుకోవడ మన్న దొక క్రొత్త విధానంగా మన సంఘం ప్రచారంచేస్తున్న రోజు లవి. కులంలో గానీ, గుణంలోగానీ, రూపంలోగానీ ఏలాంటి లోపమూ లేని విద్యావంతురాలైన వధువును నిర్ణయించినా నేను ప్రేమించిగానీ పెళ్లియాడనని యువకులు అసంఖ్యాకంగా కన్పించిన రోజులవి. అసలు తల్లి దండ్రులు కుదిర్చిన ఏసంబంధమైనా అది పాతవిధాన మనీ, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించి వరుడు స్వయంగా నిర్ణయించుకోవడం నాగరికత యనీ అనుకొంటున్న దినాలవి. ఆ ప్రభావంలో నేనూ ఒక కథానాయకుడయ్యాను. సౌభాగ్యం కూడా ఈ ప్రచారం విని మురిసిపోయినట్లు ఆమె చూపులనుబట్టి గ్రహించాను. మా ఇరువురికీ సంబంధించిన విషయాలు చర్చించు కోవడంలో కూడా మా ఇరుగు పొరుగు ఎక్కువ సరదా చూసేవారు. బహుశా వారికా చర్చ ఎక్కువ వినోదాన్ని గల్గించిందను కుంటాను. ఆ సమయంలో చాలమంది నన్ను గౌరవించడం ప్రారంభించారు. నన్ను మంచివాడని చెప్పుకోవడం నాకానం దాన్ని కల్గించింది. ప్రేమించి పెళ్లియాడే వారు మహో ఉత్త ములనీ, సంస్కార వంతులనీ, పర స్త్రీని తల్లి కంటే గౌర వంగా చూస్తారనీ నాముందే మా ఊరికి క్రొత్తగా వచ్చిన మాస్టరు జరమయ్య గా రన్నారు. ఆయన ఆధునిక సాహిత్యాన్ని బాగా ఆకళింపునకు తెచ్చుకొన్నారు. నాకు లెక్క లేనన్ని పాత పత్రిక లిచ్చి, చదివించి పాఠకుడు గానే ఉంచ కుండా రచయితగా తయారుచేశాడు. ఆయన సాంగత్యం నన్ను మరీ మంచివాణ్ణి చేసింది.

మా మామయ్య కూతురు చాలా సౌందర్యవతి. ఆమె

ఇప్పుడు వితంతువు. ఆ రోజుల్లో ఎంతో చనువుగా ఉన్న ఆమె నాతో మాట్లాడ్డం మానివేసింది. ఆమె తండ్రిగారు చిన్న పంచాయతీ చేశారు పెళ్లి విషయంలో. సౌభాగ్యను ప్రేమిం చాననే విషయం చర్చకు వచ్చింది. జరమయ్య వంటి స్నేహి తులు నాతో సంప్రదించకనే మామామయ్యగారికి నా పట్టు ఎలాంటిదో విశదీకరించారు. నేను సౌభాగ్యాన్ని తప్ప ఇతరు లను పెళ్లియాడబోననీ, ఒక సమయం సౌభాగ్యం ఎవరినైనా పెళ్లి చేసుకోవడం జరిగితే తక్షణం ఆత్మహత్య చేసుకొంటాననీ, ఏ దురదృష్టం చేతనో బ్రతికి ఉండడం సంభవిస్తే ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటాననీ మా మామయ్యకు గట్టిగా చెప్పారు.

నిజానికినాకు మా మామయ్యకూతురిమీద ఎలాంటి ద్వేషమూ లేదు. నలుగురూ దబాయించి ఉంటే నేనామెనే పెళ్లి చేసుకొనే వాడినేమో! కానీ నన్ను ఎవ్వరూ నిర్బంధించ లేదు. నేను ప్రక్కగదిలో ఉండగానే మా మామయ్య, మా నాన్నగారూ నన్ను పిలిపించి అడుగుతారనుకొన్నాను. వారలా చేయలేదు. నా వద్దకు జరమయ్య గారినీ, మరిద్దరు మిత్రులనూ రాయబారం పంపారు. వారిలో ఒకాయన మా మామయ్యగారి కుమార్తెనే పెళ్లియాడమని గట్టిగా చెబు తుంటే మరోమిత్రుడు ఆయనకు సమాధానమిస్తూ, ప్రేమంటే ఏమిటో విశదీకరిస్తుంటే, జరమయ్యగారు ఆ మధ్యవర్తులలో మధ్యవర్తిత్వం వహించి నేను సౌభాగ్యనే పరిణయమాడ దలచానని ఆ పరిణయం అతి పవిత్రవంతమైనదని ఆత్మ సంబంధ మైందని, ఆదర్శయుతమైందని నిర్ణయం చేశారు.

కొమ్ములు తిరిగిన పండితుల గోష్ఠికి తీసిపోని ఆ రసవత్తర

మైన చర్చను తన్మయుడై వింటూ నేను బెల్లం కొట్టిన రాయిలా ఉండి పోయాను. నిర్ణయం చెవిని వేయగానే మా మామయ్యగారు ఇంటిలో మంచి నీళ్లు కూడా ముట్టుకోనక వెళ్లి పోయారు.

నా మిత్రులాయనను ఒక జంతువు క్రింద జమకట్టి తీవ్రంగా విమర్శిస్తూ నా త్యాగాన్ని ఘనంగా ప్రశంసించారు. మా మామ కుమార్తెకు వైభవంగా నాకంటే ఏ యోగ్యత లోనూ తీసిపోని ఒక యువకుని కిచ్చి పెళ్లి చేసారు. ఆ పెళ్లికి నన్ను ఆహ్వానించ లేదు. నేను వెళ్లనూ లేదు. ఈ ముఖ్యమైన సంఘటన జరిగాక సౌభాగ్యను నేను పెళ్లియాడ్డం ఖాయమని ఋజువై పోయింది. నేనొక మహత్తరమైన అగ్ని పరీక్షకు ఆగి నిలిచి జయించినట్లు పరిగణింప బడ్డాను. సాటియువకులలో నేను సానబెట్టిన రత్నాన్నని, పుటం పెట్టి వెలికి తీసిన బంగారాన్నని అనిపించు కొన్నాను. 'ప్రేమ సముద్రంలో ప్రళయ తుఫాను విజృంభించడం సహజం. ఆ గాలి వానలో మీ పవిత్రమైన అనురాగాల పడవ బ్రద్దలు కాక నిలిచినందుకు నేనమితానందాన్ని ప్రకటిస్తున్నాను' అని ప్రాశాడొక కాలేజి స్టూడెంటు.

వంద వంకరలు తిరుగుతూ సాగిన సెలయేరు ఉన్నట్టుండి ముక్కుకు సూటిగా నడిచినట్లు చటుక్కున లేచి చక్కగా కూర్చుని ఠీవిగా ఉపన్యసించ డానికి మొదలు పెట్టాడాయన.

"ఉన్నట్టుండి ఒకనాటి మధ్యాహ్నం మూడు గంటలకు సౌభాగ్య ఇంటి ముందొక జట్కా ఆగింది చూశాను. ఎవరో చుట్టాలను కొన్నాను. ఆ చుట్టాలు ప్రొద్దు పోయినా పోలేదు. ఆ సాయంకాలం సౌభాగ్య కన్పించలేదు. ఆ రాత్రి పదకొండు

గంటలకు మంచంపై నిద్రిస్తున్న నన్ను జరమయ్యా వచ్చి లేపాడు. అప్పుడే గాఢంగా పట్టిన నిద్రనుండి లేచి తూగుతూ కూచున్నాను. "ఏమిటీ ఘోరం? రేపు పదేనో తారీఖున సౌభాగ్యకు పెళ్లట. వరుడు కంచిలో వర్తకుడట. ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు. ఉలిక్కి పడ్డాను. నిద్రమత్తు వదిలింది. లేచి నిలుచున్నాను. మళ్లీ కూచున్నాను. మళ్లీ నిలుచున్నాను.

'ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు" గర్జించాడు జరమయ్య "అవును వీల్లేదు. నేనామెను ప్రేమించాను." చిలుక లాగా పలికాననుకొంటానా మాటలు.

"రాపోదాం" అన్నాడు జరమయ్యా. లేచి ఆయన్ను వెంబడించాను. ఇద్దరం బడిలోకి వెళ్లాము. ఆ వేళకే అక్కడ అరడజను మంది కాచుకూర్చున్నారు. అందరూ ఇదే విష యాన్ని చర్చించు కొంటున్నారు.

"అసలు సౌభాగ్య ఎలా ఒప్పుకొంటుందీ?" ఆశ్చర్యాన్ని వెలిబుచ్చిందొక గొంతు.

"ఆమెను నిర్బంధించి ఉరి పెడుతున్నారు. ఈ కళ్లులేని సంఘం ఈ లాంటి వాటిని ఎందుకు ఎదిరించ కూడదు! ప్రశ్నిం చింది మరొక స్వరం.

"ఇలా జరిగేగదా. ఎందరో అభాగినులు ఆత్మహత్యలు చేసుకొన్నారు" వినిపించిందొక మూల నుండొక విషాద స్వరం.

"ఇంతెందుకు? రేపు రాత్రి టాక్సీ మాట్లాడి ప గుడికో

వెళ్ళి ముడిపెట్టుకొని వస్తే సరిపోతుంది" చివరి తీర్మానంగా పలికిం దొక కంఠం.

చివరికే తీర్మానమూ నెగ్గలేదు. చర్చ రాత్రి మూడు గంటల వరకూ సాగింది. మూడు రోజులు సౌభాగ్యం ప్రవర్తన చూచి ఆమెతో చర్చించి ఒక నిర్ణయానికి రావాలని మాత్రం అనుకొన్నాము. ఆమెతో ధైర్యంచేసి మాలో ఎవరూ మాట్లాడ లేదు. అసలు మాట్లాడే అవకాశమూ దొరక లేదు. ఒక ప్రచారం మాత్రం ఉధృతంగా సాగింది. సౌభాగ్యం పెళ్లికి సుతరామూ ఒప్పుకోవడం లేదనీ, ఆమె అన్నాహారాలు మాని ఏకధారగా ఏడుస్తూ కూచున్నదని.

అసలామె పెళ్లిలోగానే ఏ గొయ్యిలోనో దిగుతుందని కూడా గుసగుసలు బయలు దేరాయి. నేను ఇల్లు కదలడం మాను కొన్నాను ఆ వారంలో ఒక్కసారి ఒక నిమిషం సౌభాగ్యం కన్పించింది ఆమెలో ఏమార్పూ నాకు కన్పించ లేదు. ఎక్కడో ఒక మూల ముఖంలో ఒక విచార రేఖ అస్పష్టంగా కన్పించింది. అలా కన్పించడం నాభ్రమేమో అను కొన్నాను. ప్రచారాన్ని వింటే ఒకటి రెండు రోజుల్లో ఏదో ప్రళయం జరిగే సూచన కల్పించింది. కథలు, కావ్యాలూ, సినిమాలూ తదితర సాహిత్య కళాంగాలలో కన్పించి నట్టు ఏఅర్ధ రాత్రి సమయంలోనో ఆమె నావద్దకు వస్తుందనీ, నన్ను తట్టి లేపుతుందనీ, ఆ లోచన అడుగుతుందనీ, అప్పుడు ఇద్దరం కలిసి ఏ అడవినిబట్టియో చల్ మోహన రంగా ఆలాపించు కుంటూ వెళ్ళి పోతామని అను కుంటూ కలలు గంటూ, కలత నిద్రలో ఎండిన మామిడాకుల తోరణాల గలగలలా మె గాజుల సవ్వడులగా గాటిలో కోడెల కుప్పెల ధ్వని తరంగా

లామె కాలియందెల రవళిగా భ్రమించాను. అలాంటి దేమీ జరగలేదు. పోనీ ఏ రాయబారమో వస్తుందనుకొన్నాను. దాత్యం వివాహ ఘట్టాల ప్రాతిపదికలని పరీక్షించాను. అదీ జరుగు లేదు. పెళ్లి నాటి రాత్రి వరుడు ఊళ్లోదిగి నపుడు సౌభాగ్య ఏ నడబావిలోనో దిగుతుందని, ఆ ఘోరదృశ్యం చూడ్డంకంటే చావు మేలనీ. అలాంటి విషాద పరిణామాలు కలుగరాదనీ దేవుని ప్రార్థించాను. ఏదీ జరుగ లేదు. వివాహం అతి వైభవంగా జరిగింది.

ఆ మరునాడు సౌభాగ్యం సంపదకు ఆశపడిందని, ప్రేమికుని వంచించిందని నా ముందు చాల మంది అన్నారు. ఆమెను తీవ్రంగా నిరసించారు. ఆ నెలరోజులూ మా తల్లి దండ్రులు నా వెంట కావలి పెట్టారు. నేను విరాగి నయ్యాననీ ఏ క్షణం లోనో ఆత్మ హత్య చేసుకొంటానని బాగా భయపడ్డారు. నాకు తెలియకనే నేను గడ్డం పెంచాను. ఆత్మహత్య తప్పింది గానీ సన్యాసత్వం తప్పలేదు. ఎవరి నోట విన్నా నేనిక ఆ జన్మాంతమూ బ్రహ్మచారిననే వాక్కే. బ్రహ్మచారినై పోవాలనే దీక్ష నాలో ప్రభవించింది. ఏం? విసుగు లేదు కదా? నీకింకా అనుభవం లేదు. ఇలాంటి విషయాలు నీకెవరూ చెప్పరనుకుంటాను. నిన్ను కలుసుకొన్నప్పటి నుండి నీతో మాట్లాడాలనీ, ఈ చిన్న నాటి విషయాలు చెప్పాలనీ అనుకొన్నాను. నాది చాలా పెద్ద కథ. పాపపుణ్యాలు చెప్పుకోవడంలో సంతృప్తి కూడా ఉంది. ఏమంటావ్?" అని ఆయన ఒక్క క్షణం ఆగాడు. ఉజ్వలంగా ప్రవహిస్తూ వేయి కెరటాలతో పైకి లేచిన కొండ వాగులాగా కన్పించిన ఆ ప్రసంగంలో ఆసాంతం మునిగి పోయిన నేను "కానివ్వండి" అన్నాను.

"నీవు నిజమైనా అనుకో అబద్ధమైనా అనుకో బ్రహ్మచర్యం చాలా ప్రమాదమైంది అదొక కఠిన పథ్యం. ఆకలిగొన్న పథికుని ముందు పంచభక్ష్య పరమాన్నాలుంచి నీవు వాటిని చూస్తూ ఉపవసించు అంటే ఆప్రయాణీకునిస్థితి ఎలా ఉంటుందో అలాగే ఉంటుందనుకో మా ఊర్లో నాకు వరుస ఉన్న అమ్మాయిలు కొందరుండేవారు. వారు సరదాగా మాట్లాడేవారు. అలాంటి వారు పలకడమే మాను కొన్నారు. ఎవరు చూచినా నన్ను బెదురు చూపులే చూచే వారు. నీకు చెప్పగూడదనుకొన్నా, ఆ రోజుల్లో జరిగిన ముఖ్యమైన సంఘటనలు దాచిపెడితే ఆత్మ వంచనే ఔతుంది. ఆ సంఘటనలు తలంచుకొని సిగ్గు పడుతాను నేటికీ. ఆత్మ కథలు వ్రాసే వారు అన్ని మంచి చెడ్డలనూ లిఖించు కొన్నట్టే చెప్పుకొనే వారు గూడా తాను చేసిన తప్పులను చెప్పుకోవడం మంచిదనుకొంటాను. నన్ను నిర్బంధించి సమాజం బ్రహ్మచారిగా రూపొందించిందా అన్పించేది నాకు. నా మంచి తనం నాకే భరించరానిదై పోయింది. బావా అని పిలువ వలసిన మరదళ్లు గూడా అన్నా అనడం ఆరంభించారు. నేనొక చిన్న స్వాముల వారినై పోయాను. ప్రతి వెన్నెల రాత్రి నాకొక కాళరాత్రియైపోయింది. ప్రతి మలయ మారుతమూ నాకు ఝంఝూమారుతమై విన్పించింది. ప్రతి కోయిలపాటా నాకు మృత్యు దేవత పొలికేకలా అన్పించింది. సర్పవైరులు పడగలు విప్పుకొని బుసలు కొట్టే పచ్చి నాగులనుకొన్నానంటే నమ్ము. ప్రపంచంలోని మానవులలో స్త్రీ మూర్తిని సృష్టించిన భగవంతుడు వెర్రివాడైనప్పుడే బ్రహ్మచర్యంలో అర్థ ముంటుందను కొన్నాను. కాళీయ ఫణిఫణాగ్రాల గరళాన్నైనా మనిషి వేళ్లతో సులభంగా పిండుకోవచ్చు. మండుతున్న భాను

గోళాన్నైనా ఆప్యాయంగా కౌగిలించుకోవచ్చు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరించడం మహా క్లిష్టం. అందుకే గౌతముని కంటే వివేకానందుడంటే నా కమిత భక్తి. విశ్వామిత్రుని కథనం వింటే నా కమితమైన జాలి

ఆ రోజు నాగాంబ ఇంటికి వెళ్లాను. ఆమె పెళ్లి చేసుకొని నాలుగు మాసాలే ఐంది. ఆపాటికింకా అత్తగారింటిలో కాపురం పెట్టలేదు. మంచి రోజులు రాలేదనీ, ఏవో అటంకాలున్నాయని పుట్టింటిలోనే ఉంది. నాగాంబ అప్పుడే కళ్లు తెరుస్తున్న కలువ పువ్వులా నవ్వుతూ ఆహ్వానించింది. నా బలహీనత చరమాంకం లోపడి అటూ ఇటూ రెపరెపలాడే మనస్సును లాగే కళ్లెం తెగిపోయింది. ఒక్కసారి ఆమె వంక చూశాను. నా చూపులోని అర్థం ఆమె గ్రహించింది. ఏదో మాట వరుసకు ఏమని ప్రారంభించాలో తెలియక "ఏమీ లేదు ఏమీ లేదు" అంటూ తత్తరపడ్డ నన్ను చూచి ఆమె నిర్లక్ష్యంగా నవ్వుతూ "మీరంతా ప్రేమించి పెళ్లియాడే వాళ్లుగదా?" అంటూ అందుకొని వేడి వేడిగా సున్నితమైన పదాలతో అవహేళన చేసి వదలిపెట్టింది. నేను తలవంచుకొని చక్కా వచ్చి వేశాను. చాలా తప్పుచేసినట్టు బాధపడ్డాను. ఆమె చులకన చేయడం నా మేలుకే నన్నట్టు సంతోషించాను. ఇలాంటి సంఘటనలు కాకున్నా మరి కొంచెం మోటు పద్ధతిలో ఒకటి రెండు జరిగి వ్రతం చెడకనే తప్పుకోగల్గాను. వాటిని విస్తరించి చెప్పడం అనవసరంకూడా. అప్పటి నుండి నాలో వైరాగ్యం హెచ్చింది. మనసుకు కట్టిన పగ్గాలను ముడిపెట్టాను. నిర్థరంగా ఉంటే లాభం లేదని ఒకనాటి రాత్రి ఎవ్వరికీ చెప్పక ఆశ్రమానికి వెళ్లి చేరి పోయాను.

ఆశ్రమానికి, ఇంటికి భేదం వుంది. ఇంటివద్ద పని చేయకున్నా ప్రతిపూటా హాయిగా తిండి పెడుతుండేవారు. ఆశ్రమంలో కష్టపడవలసి వచ్చింది. పూల చెట్లకు పగలల్లా నీరు తోడేవాణ్ణి. రాత్రి పూటల్లో అన్నకావడిని తీసుకొని యింటింటా భిక్షం తెచ్చేవాణ్ణి. ఆ పల్లెటూరి రైతాంగానికి మా పట్ల అమితాసక్తి. ప్రతి యింటా అన్నం పెట్టేవారు. అక్కడ నా వ్రతం జయప్రదంగా సాగినా ఒక్కొక్కసారి భిక్ష వేస్తున్న చేతుల గాజుల గలగలలకు నా ఒళ్ళు పులకిస్తుండేది. వారి ముఖాలు చూడకూడదనుకున్నా అప్రయత్నంగా తల పైకెత్తేవాణ్ణి. నా కళ్ళు నావి కావనుకొనేవాణ్ణి. ఆశ్రమంలో స్వాములవారు నిగ్రహ శక్తిని సమీకరించుకోవాలనేవారు. ఇంద్రియాలు గుర్రాలనీ, వైరాగ్యమనే కళ్ళెంతో వాటిని బంధించి మోక్ష సామ్రాజ్యానికి సూటిగా జీవిత రథాన్ని నడిపించాలనీ, ముందు అన్నిటికంటే కళ్ళను జయించాలనీ,

"పై పైన మెరుగులకు
భ్రమపడుచు లోంగేవు
పచ్చిమాంసపు ముద్దరా"

అంటూ తత్వాలతో ఉపదేశించేవారు. ఆ ఉపన్యాసాలు వింటున్నవరకవి తియ్యగా కన్పించేవి. అటునుండి ఇటు తిరిగితే ఇవి ఈ మధుర వీక్షణాలు ఇంకా ఎంతో రుచిగా తోస్తుండేవి.

ఒకనాడు వేదాంత మహాసభకు వెడుతున్న గంగాంబకు తోడుగా స్వాములవారు నన్ను వెళ్ళమన్నారు. గంగాంబ పాతికేళ్ళ వితంతువు. భర్త తాలూకు ఆస్తితో ఆశ్రమం చేరి

ఏడాది కావచ్చింది. మూడు వందల మైళ్ళ ప్రయాణం గురు వాజ్ఞను ధిక్కరించరాదు, సరిగదా ఏ మాత్రమూ అభ్యంతరం కూడా చెప్పరాదు. నా కేదో అనుమానంగా ఉన్నా అంగీకరించాను. ఇద్దరమూ స్వాములవారి పాదాలపైబడి సెలవందుకొని బయలుదేరాము. గంగాంబ వ్యక్తిత్వం చాల గొప్పది. ఆమె భర్తతో ఏ సుఖమూ అనుభవించక ముందే తాను బాల్యంలో ఉన్నప్పుడే అతడు చనిపోయాడు. ఆ నాటి నుండీ ఆమె కఠినమైన బ్రహ్మచర్యాన్నే అనుభవిస్తోంది. అదెందుకో ఆ ప్రయాణంలో ఆమెలో అనుకోని మార్పు వచ్చింది. అత్యంత సన్నిహితత్వంలో ఆమె ఆ కాంక్షను వ్యక్తం చేసింది. స్త్రీ నిజంగానే అబలనుకున్నాను కానీ గురువుగారు జ్ఞాపకం వచ్చారు. అదుకు తగ్గట్టు మహాసభ కా బండి తప్పితే వెళ్ళి ప్రయోజనం లేదు. వెళ్ళి మళ్ళీ వస్తున్నప్పుడు ఆలోచించుకో వచ్చునని సంతృప్తి పడ్డాను. నేనివన్నీ స్పష్టంగా చెబుతున్నాను. అనుభవంలోని సత్యాలను చెప్పడంలోనే ఉపదేశం సార్థకత చెందుతుంది. మంచి చెడ్డల తారతమ్యాలు తెలుస్తాయి. ఆశ్చర్యమేమంటే మహాసభలో నన్ను ప్రారంభోపన్యాసం చేయమన్నారు. పెద్ద ఊరేగింపుతో నన్ను తీసుకెళ్ళారు.

"అస్ఖలిత బ్రహ్మచారి, అఖండ ప్రజ్ఞావంతుడు, ఆధ్యాత్మిక జీవానందస్వాములు అంటూ నన్ను ఎంతో ఘనంగా పరిచయం చేశారు. వేలాది శ్రోతలు జయజయ నినాదాలు చేశారు. నా పరిచయం కోసం వందలాది తహతహలాడారు. నన్నెంతో పునీతుణ్ణిగా, పవిత్రవంతునిగా విశ్వసించి పూజించారు. గౌరవించారు. నా ఉపన్యాసం విన్నారు. అప్పటికప్పుడే

నా మూర్తిత్వం మీద, నా వ్యక్తిత్వం మీద ఆశుకవిత్వాలు చెప్పారు. దారిలో నాలో కల్గిన పతనావస్థను తలంచుకొని సిగ్గుపడ్డాను. గంగాంబ కూడా సిగ్గు పడింది. నన్నా ప్రాంతాలలో మరో రెండు మాసా లుంచమని స్వాములవారికి తంతి నిచ్చారు. వారనుమతించారు. గంగాంబను పంపివేసి నే నక్కడే ఆగిపోయాను."

ఇక్కడికొక ఘట్టం అయిందన్నట్టుగా ఆయన ఉపన్యాసాన్ని ఆపి ఒక్క నిమిషం మౌనం వహించి మొదలు పెట్టాడు.

"ఆ వెనుక నేనే ఒక ఆశ్రమాన్ని నెలకొల్పాను. చక్కని వాతావరణం. ఎంతో ప్రశాంతమైన ప్రదేశం. బాగా చదివాను. ఆధ్యాత్మిక గ్రంథాలను దాదాపు గాలించి వేశాను. మీరూ చూశారుగా నా వ్యాసాలు "జీవుడు దేవుడు" అన్న విషయంపై. ఆత్మ విమర్శ అన్న శీర్షిక క్రింద నేను వ్రాసిన వ్యాసాలన్నీ హిందీలోకి అనువదించుకొన్నారు. ఇంద్రియాలను జయించాను. జయించానని నాలో నేనే ఊని ఊని చెప్పుకొన్నాను. ప్రతి మానవుడూ ఒక బొమ్మగా కన్పించేవాడు. మరో దృష్టితో పరమాత్ముడుగా కన్పించేవాడు.

ఒక రోజున తిరువాన్కూరు నుండి ఇద్దరు వచ్చారు నా ఆశ్రమం చూడటానికి. ఆ ఇద్దరూ స్త్రీలే. తల్లీ కూతుళ్ళు. ఆ యమ్మాయిలో నన్నాకర్షించింది ఆమె నాసికం. నీకు నవ్వొ రావచ్చు ననుకొంటాను. యదార్థం చెప్పాలంటే నే నొక కళాకారుణ్ణి. చిత్ర కారుణ్ణి. ఆమె ముక్కు ఎంత సూటిగా వున్నదనుకున్నావు! ప్రపంచంలో నేను చాలామంది సౌందర్య

వతులను చూశాను. ఎక్కువ అందం కన్నులలో కన్పిస్తుందంటారు. కానీ. ముక్కు తీరుల్లో ఎంతో మురిపెం ఉంది. ముక్కు అందం లేనిది ముఖం అందం ఉండదు. ఇంత నిగ్రహ శక్తిని సంపాదించిన నేను ఆ క్షణంలో ఓడిపోయాను ఇప్పటికీ నాకాశ్చర్యంగా ఉందంటే నమ్ము. ఆరోజునుండి చూస్తున్నాను. అలాంటి ముఖం తీరు నాకు కన్పించలేదు. బహుశా కన్పించదు.

ఆ రాత్రి నేను కేవలం జంతువై పోయాను. నాలో పశుప్రవృత్తి విజృంభించింది. నా బ్రహ్మచర్యమనే జీవిత నౌకమీద సగర్వంగా రెపరెపలాడుతున్న పతాకం పడిపోయింది. అర్థరాత్రి నిద్దురపూట అతిథిగా నా ఆశ్రమంలో ఉన్న ఆ సుకుమారి వైపు నడిచాను. ఇంతలో నాశిష్యుడే "కమండలం ఇక్కడే వుంది స్వామీ" అంటూ వెంట బడ్డాడు. బహుశా ఏ బహిర్భూమికో వెళుతున్నానని అనుకొన్నాడేమో! రెండు నిమిషాలు నిరుత్తరుడైన నన్ను చూచి అతడూ విస్మయుడై అర్థంచేసుకొని ఆక్షణంలో నాకు గురువైనాడు. ఆగిపోయాను. అడుగు పెట్ట లేదు. ముందుకొక్క అడుగు వేయకుండా వెనుదిరిగాను. ఆ ఉదయం ఆ ఇద్దరూ నాతో అరగంట గీతా పారాయణం చేశారు. ఆమె వంక చివరి క్షణంలో చూశాను. ముప్పదేళ్ళుంటాయి. భగవంతుడే నా బోటివారిని పరీక్షించడానికి అలాంటి అందగత్తెలను సృష్టించాడేమో! వారు వెడుతామన్నారు. సెలవు పుచ్చుకొన్నారు. ఆ వారం రోజులూ ఆమె మూర్తి నా కనుల ఎదుటే నిలిచి పోయింది. ఆ మాటకు వస్తే ఇప్పుడూ ఆమూర్తి అలానె ఉంది. అయినా నేను విజేతను కావాలనే దీక్ష ఉంది. అయ్యాను కూడా. కానీ ఈలాంటి వెన్నెలను చూచినప్పుడు ఈ మల్లెపూలు

నవ్వుతున్నప్పుడు ఆశ్రమానికి కలకలలాడే అతిథులు వచ్చి నప్పుడు నాలో ఎక్కడో ఇంకా దాగి ఉన్న కాంక్షలు పరుగు లెత్తుతాయి. అయినా అరువదేళ్ళు నిండి పోయాయి. పండు ముసలినిగదా! బాగా ఎండి పోయాను. ఎప్పుడో రాలి పోతాను. అంతవరకూ దేవుడు నా దీక్షను కొనసాగిస్తాడు. అసలీ విధంగా నిర్బంధ నియమాలతో కోరికలను చంపుకొని వాంఛనల అణచుకోవడం తప్పుగానే కన్పిస్తుంది. ఒక్కొక్క సారి సౌభాగ్యం జ్ఞాపకం వస్తుంది. ఆమె నలుగురి పిల్లలతో కన్పించిందొకసారి. మా మామ కుమార్తె వితంతువైనాక బాగా చిక్కిపోయింది. ఆశ్రమంలో ఉంటానని వచ్చింది. వద్దనీ పంపేశాను. నాగాంబ బాగానే ఉంది. నా ఈడువారు చాలా మంది రాలిపోయారు. నేనొక్కణ్ణే ఏ ఆనందమూ లేక నిస్సారంగా బ్రతికాను ఈ బ్రతుకు విరరకమనే అనుకొంటాను. అరువదేళ్ళు...అబ్బా! ఎలా గడిపాను...ఇంకో పదేళ్ళు బ్రతికితే చాలనుకుంటాను" అన్నారు.

"సంసారంలో విరక్తి గల్గినపుడు సన్యాసమైతే బావుండు ననిపించినట్లే సన్యాసంలో విరక్తి పుట్టిన మీకు సంసారమైతే బాగుండు నన్పిస్తుందేమో!" అన్నాను నవ్వుతూ.

"ఏమిటో...నాకిన్నేళ్ళు నిండీ, ఇంత చదువుండీ, ఇంత అనుభవం పండీ జీవితమంటే అయోమయంగానే కన్పి స్తుంది కదండీ. ఏమైనా సంసారం నిలువీత సన్యాసం ఎదురీత." అన్నారు స్వాములువారు.

తొమ్మిది కావచ్చింది. ఆ భగవద్గీత వ్యాఖ్య కొంచెం ఇమ్మనండి వారం రోజుల్లో పంపుతాను." అన్నాను పైకిలేస్తూ.

"వారం కాకుంటే నెల రోజుల్లో ఇవ్వండి. అంటూ లోపలికి వెళ్ళి తెచ్చి యిచ్చారు స్వాములవారు.

వారం గడిచాక భగవద్గీతను పట్టుకెళ్లాను. స్వాముల వారు పూర్ణ యాత్రా స్పృహల్లో దేశాటనం వెళ్ళారని ఆశ్ర మంలో చెప్పారు. వారు లేని ఆశ్రమం చిన్నబోయినట్టుంది. నందివర్ధనం చెట్టు ప్రక్కనున్న నెమిలి దీనంగా కన్పించింది. తోటలో నడయాడుతున్న లేడి చూపుల్లో జాలి తొణికిసలాడు తోంది. జాజి పందిరిక్రింద ఊడ్చినట్టు లేదు. ముత్యాల ముగ్గులు చెదిరివున్నాయి. రత్నకంబళి కన్పించలేదు. దిండ్లు ఓమూల ఒడిగి విషాదంగా కూచున్నాయి. నల్ల పిల్లి మ్యావు మ్యావు మని ఏడుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడి ప్రకృతి రోదించినట్టు విన్పించింది.

ఆశ్రమాన్ని వదిలి ఇంటికి వచ్చి వేశాను.

ఆరు మాసాలు గడిచాక జలంధర్ స్టాంపుతో ఒక పెద్ద కవరు వచ్చింది. జలంధర్ నుంచి వ్రాసే స్నేహితులెవరూ లేరు. నాకు స్వాములవారి విషయం జ్ఞాపకానికి రాలేదు.

ఆ లేఖలో ముత్యాలవంటి అక్షరాలతో ఆయ నిలా వ్రాశారు:

"ఆత్మ స్వరూపా! పరమాత్ముని తేజస్సులో మనం కలిసే ఉన్నాం. అసంతృప్తిగా జీవించడం ఆత్మను వంచించ డమే ఔతుంది. ఆత్మ వంచన పరమాత్మ వంచనే. ఆత్మ సంతృప్తియే పరమాత్మ సంతృప్తి. సంసారి స్వర్గద్వారాలలో ప్రవేశించడని ఎక్కడా చెప్పబడలేదు. వితంతు వివాహాలు

నిషేధాలని కూడా చెప్ప బడలేదు. మీతో ఆరోజు చెప్పిన తిరువాన్కూరు మహిళ ప్రయాగలో కన్పించింది. ఆమెను నేను గుర్తించాను. నన్నామె గుర్తుపట్టింది. ఆమె నా కోసమే మరల దక్షిణాభి ముఖియై యాత్ర చేస్తున్నట్లు చెప్పింది. నే నామె కోసమే ఉత్తరాభిముఖుడనై నట్టు భావించు కొన్నాను. ఆమె తల్లి పండరీపురంలో పరమపదించిందట. ఆమె విలపిస్తూ నన్ను కౌగిలించుకొన్నది. నేను ఓదారుస్తూ ఆమెను చేరదీశాను. బదరీనాథులో మేము పరిణయ మాడి నట్లు ప్రమాణాలు స్వీకరించాము. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు పెళ్లి చేసికొనే హక్కు నాకూ ఉందనీ మీకు తెలుసు. వితంతువు పెళ్లి యాడటం సంస్కారమనుకొనేవారు మా వివాహానికి అభ్యంతర చెప్పరు. కాగా కొందరు లేదా చాలా మంది కూడా ముందు గృహస్థాశ్రమ ధర్మాన్ని నిర్వ హించి ఇక ఎటూ వీలులేనపుడు రక్తం చల్లబడ్డపుడు వేదాంతం వైపు మరలి సన్యాసం స్వీకరిస్తారు. నే నలాకాదు. యౌవనాన్ని సన్యాసహోమంలో వ్రేల్చి వేశాను వృద్ధా ప్యంలో సంసార శకటాన్ని లాగటానికి పూనుకున్నాను. ఇవి తారుమారై తల క్రిందులై అత్యంత కష్టాలను కల్గించినా సమర్థతతో నా పాత్రను నిర్వహించాను.

మేము ఆశ్రమానికి వస్తాము. స్వాములవారు పెళ్లి చేసుకొన్నారని మన పరిసరాల వారు వింటే అవహేళన చేస్తారనే భయం నాకు లేదు. నా ఆశ్రమం మీద సంపూర్ణ మైన హక్కు నా కుంది. ఆ యాశ్రమాన్నే గృహంగా మార్చుకోగలను. మార్చుకొంటాను. గృహస్థాశ్రమ ధర్మం పూర్తియైనాక ఏ యజమానుడైనా అదే గృహాన్ని ఆశ్ర

మంగా మార్చుకోలేదు గదా! సెలవు.

"జీవానందం"

సంతకంలో స్వామి అన్న పదాన్ని ఉద్దేశ పూర్వకంగానే ఆయన తొలగించారనుకొన్నాను. ఆ లేఖ చదివాక వారిలో నాకేమీ తప్పు కన్పించలేదు. నిండుకుండలో తొణుకు కన్పించనట్టు, మహా సముద్రంలో కాకి రెట్ట కలియనట్టు ఆ మూర్తిత్వంలో ఏ లోటూ కన్పించక పోవడం; పైగా జాలి కలగడం నాకే ఆశ్చర్యంగా ఉంది.

ఆరుమాసాలు గాదు. ఒక దశాబ్దం గడిచింది. అయన రానేలేదు. ఆశ్రమం నిరాశ్రయమై పోయింది. ఇంతకూ ఆ వృద్ధ వధూవరులేమైనట్టు? మళ్లీ విరాగులయ్యారా? లేక ఒకరినొకరెడబాయకుండా ఏ మంచుకొండల సానువుల్లోనో శాశ్వతంగా విశ్రాంతి ననుభవిస్తున్నారా? ఏమో! ఆయన ఉపన్యాసం మరువరానిది. ఆయన శుభలేఖ విస్మరింప వీలుగానిది. ఈ రెండూ యదార్థ జీవితాన్ని చూపే రెండు దర్పణాలు.

